క్లుప్తంగా

బీఆర్ఎస్ శ్రేణులకే సంక్షేమ పథకాలు



ఆర్మూర్‌టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆ పార్టీ వాళ్లకే లబ్ధి చేకూరుతుందని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోలా వెంకటేశ్ విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎటువంటి వివక్ష లేకుండా అందరికీ పారదర్శకంగా పథకాలు అందుతాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ మోసపూరిత వాగ్దానా లు చేస్తున్నదని, వాటిని ప్రజలు నమ్మొద్దన్నా రు. నాయకులు మీర్ మాజిద్, జిమ్మి రవి, మందుల పోశెట్టి, అబ్దుల్ ఫయీమ్, బట్టు శంకర్, మీసాల రవి, బాలకిషన్ పాల్గొన్నారు

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

ఎడపల్లి(బోధన్): వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, క్వింటాలుకు రూ.3000 మద్దతు ధర కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రవి డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శుక్రవారం ఎడపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మల్లేష్, సుదర్శన్, హనుమన్లు, గంగారాం, ఎర్రన్న, నారాయణ మోహన్ తదితరులు పాల్గొన్నారు

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఎడపల్లి(బోధన్): మండలంలోని జాకనంపేట్ గ్రామంలో శుక్రవారం ముదిరాజ్ ఆత్మ గౌరవ సభ వాల్‌పోస్టర్లను ముదిరాజ్ ఐక్యవేదిక జిల్లా నాయకుడు యాసాడా నర్సింగ్, సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించే ముదిరాజ్ ఆత్మ గౌరవ సభతో ముదిరాజ్‌ల సత్తా చాటాలని, జిల్లా నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావాలని కోరారు.

పనులు నిలిపివేయాలి



కోటగిరి(రుద్రూర్): కోటగిరి మండల శివారులో అనుమతి లేకుండా నిర్మిస్తున్న పశువధశాల పనులు వెంటనే నిలిపి వేయాలని స్థానిక యువకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వారు తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయాలు ఉన్న ప్రాంతంలో చేపడుతున్న అక్రమ పశు వధశాల పనులను నిలిపివేయాలన్నారు.

మొక్కలను రక్షించాలి



బాల్కొండ: హరితహారంలో నాటిన ప్రతి మొక్కను రక్షించాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో రాజన్ అన్నారు. మెండోరా మండల కేంద్రంలోని పల్లె ప్రకృతివనం, నర్సరీలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. చనిపోయిన మొక్కల స్థానంలో మొక్కలు నాటాలన్నారు. మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

హక్కుల సాధన కోసం పోరాడాలి



భీమ్‌గల్: తమ హక్కుల సాధన కోసం వడ్డెరలు పోరాడాలని వడ్డెర హక్కుల పోరాట సమితి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సూర సురేష్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న వర్ధంతి సందర్భంగా భీమ్‌గల్‌లో శుక్రవారం వడ్డెర కులస్తులు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం వడ్డెర హక్కుల పోరాట సమితి సంఘంను ఏర్పాటు చేశారు. సురేష్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు చంద్రం, భాస్కర్, అంజయ్య, రాజు, నరేష్, కుమార్, రాములు, గణేష్, నర్సయ్య లు పాల్గొన్నారు.

టీఎన్జీవో భవనానికి స్థలం కేటాయించాలి

భీమ్‌గల్ : టీఎన్జీవో భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ టీఎన్జీవో భీమ్‌గల్ తాలుక అధ్యక్షుడు రాజశేఖర్, సంఘ ప్రతినిధులు శుక్రవారం భీమ్‌గల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమం కోసం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. నాయకులు కుంట శ్రీనివాస్, లక్‌పతి, పురస్తు నరేష్, ధనంజయ్, బార్గవ్, నవీన్ పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- మాక్లూర్‌లో ప్రజా ఆశీర్వాద యాత్ర



మాక్లూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

మాక్లూర్: రానున్న ఎన్నికల్లో గెలిపిస్తే అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. నమస్తే నవనాథపురం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాక్లూర్‌లో జీవన్‌రెడ్డి ప్రజాఆశీర్వాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటివరకు రెండుసార్లు గెలిపించి తనను ఈ స్థాయిలో నిలబెట్టారని, అందుకు మీ అందరికీ జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తే ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తానన్నారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఎంపీపీ మాస్టర్ ప్రభాకర్, ఎంపీడీవో క్రాంతి, సర్పంచ్ అశోక్‌రావు, నాయకులు రమణారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల కంటతడి..

మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన ఆశా వర్కర్లను ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తిరస్కరించడంతో కంటతడి పెట్టుకున్నారు. వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన ఆశా వర్కర్లను పోలీసులు అడ్డుకున్నారు. కేవలం వినతిపత్రం ఇస్తామని ప్రాధేయపడిన పోలీసులు కనికరించలేదు.

బీటీరోడ్డు నిర్మాణానికి శంకు స్థాపన

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాంలో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలోని మహిళలకు బతుకమ్మ చీరలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. యువతకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఉప సర్పంచ్ గద్దం గంగా రెడ్డి, మాజీసర్పంచ్ బియాంక్ గణేష్, నాయకులు ఉప్పునూతుల శ్రీనివాస్ రెడ్డి, ఇట్టెడి లింగా రెడ్డి, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్ ప్రారంభం..

నందిపేట్(ఆర్మూర్): నందిపేటలో అగ్నిమాపక కేంద్రాన్ని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్‌వందనాన్ని స్వీకరించిన అనంతరం ఆయన ఫైర్‌ఇంజిన్‌ను స్వయంగా డ్రైవ్ చేశారు. ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి, జెడ్పీటీసీ యమునాముత్యం, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మురళీమనోహర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ భానుప్రతాప్, స్టేషన్ ఆఫీసర్ నర్సింగరావు, సర్పంచ్ సాంబారు వాణీతిరుపతి, ఉపసర్పంచ్ భరత్ పాల్గొన్నారు.



నందిపేటలో ఫైర్‌ఇంజిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పిల్లల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఆర్మూర్: పిల్లల సంపూర్ణ ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రాంమందిర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముఖ్యమంత్రి అల్పాహార పథకం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అలాగే మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో దేవాంగ సంఘ భవనాన్ని ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, వైస్ చైర్మన్ షేక్‌మున్ను, కౌన్సిలర్లు గంగామోహన్‌చక్రు, బందారు ప్రసాద్, పూజ నరేందర్ పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో బ్రేక్‌ఫాస్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి





ఏరాజ్‌పల్లిలో పల్లె దవాఖానా భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే.. విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే

- బోధన్ ఎమ్మెల్యే షకీల్
- గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

బోధన్: ప్రభుత్వాస్పత్రులు, పల్లె దవాఖానాలకు వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. పెంటాకుర్దు క్యాంప్, ఖాజాపూర్, ఫత్తేపూర్, అమ్దాపూర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన జీపీ భవనాలను ప్రారంభించారు. ఏరాజ్‌పల్లిలో పల్లె దవాఖానా నూతన భవనాన్ని ప్రారంభించి, వైద్య సిబ్బందితో మాట్లాడారు. సాలూర శివారులోని గిద్ద చెరువులో చేపపిల్లలను విడుదల చేశారు. ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, జెడ్పీటీసీ పెద్దోళ్ల లక్ష్మి గంగారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంజీవ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అల్పాహారం ప్రారంభం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో సీఎం కేసీఆర్ అల్పాహార పథకాన్ని ఎమ్మెల్యే షకీల్ ప్రారంభించి, విద్యార్థులకు అల్పాహారం వడ్డించారు. అనంతరం పట్టణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని ఆజాంగంజ్ కాలనీలో ఏర్పాటు చేసిన బస్తీదవఖానాను ప్రారంభించారు. ఆర్డీవో రాజాగౌడ్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలి





కమ్మర్‌పల్లిలో సమ్మె నిర్వహిస్తున్న ఆశావర్కర్లు.. రెంజల్‌లో రాస్తారోకో చేస్తున్న ఆశావర్కర్లు

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మండలకేంద్రంలో చేపట్టిన సమ్మె శుక్రవారం 12వ రోజు కొనసాగింది. సమ్మెకు కాంగ్రెస్ నేత సునీల్‌రెడ్డి మద్దతు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. నాయకులు సుంకెట రవి, శ్రీను, శ్రీను, రేవతి గంగాధర్ పాల్గొన్నారు.

రెంజల్(బోధన్): ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లను తీర్చాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఆశావర్కర్లు శుక్రవారం నవీపేట్–కందకుర్తి ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శులు శంకర్, గంగాధర్, సిబ్బంది రేవతి, కవిత, సుజాత, లావణ్య, లక్ష్మీ, పద్మ, పావణి, శ్యామల, వాణీ, సువర్ణ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే





పెంటాకలాన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు.. నందిపేట నుంచి పాదయాత్ర చేస్తున్న నాయకులు

బోధన్: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. మండలంలోని పెంటాకలాన్ గ్రామంలో శుక్రవారం ఆయన గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు ఆరు గ్యారంటీ స్కీంలను వివరించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గెలిపించాలని కోరారు. నాయకులు నాగేశ్వర్‌రావు, అల్లె రమేష్, సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్ 5వ వార్డులో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ పార్టీ పథకాలపై ప్రచారం నిర్వహించారు. నాయకులు పాషా మోయినొద్దీన్, తలారి నవీన్, అబ్బగోని గంగాధర్‌గౌడ్, సాయిలు ప్రసాద్, చిరంజీవి పాల్గొన్నారు.

వర్ని: మండలంలోని పైడిమల్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు గడపగడపకు కాంగ్రెస్ పార్టీ పథకాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు సురేష్ బాబా, కాసుల రోహిత్, గబ్బర్ సింగ్, కిషన్, సాయిలు, శంషుద్దీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

నందిపేట్(ఆర్మూర్): కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుతూ పార్టీ మండల అధ్యక్షుడు మందమహిపాల్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ పాదయాత్ర చేపట్టారు. నందిపేటలోని నందిగుడిలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి బాసర అమ్మవారి ఆలయానికి పాదయాత్ర ప్రారంభించారు.

సంక్షిప్తం

మీడియాపై ఆంక్షలు సరికాదు

ఆర్మూర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం మీడియాపై ఆంక్షలు విధించడం సరికాదని ఎస్ఎఫ్ఐ ఆర్మూర్ డివిజన్ నాయకుడు సిద్దాల నాగరాజు అన్నారు. పత్రిక స్వేచ్ఛపై కేంద్రం దాడిని ఖండిస్తూ ఆల్‌ఇండియా కమిటీ పిలుపుమేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మీడియాపై కేసులను ఎత్తివేయకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతో అభివృద్ధి

ఆర్మూర్‌టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల వారికి అండగా ఉంటూ అభివృద్ధిలో ముందుకు సాగుతున్నదని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపవన్ అన్నారు. తమ వేతనాలను పెంచడాన్ని హర్షిస్తూ ఆర్పీలు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్పీలు అరుణ, కమల, స్వరూప, లహరి, జయలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

స్వర్గధామ రథానికి విరాళం అందిస్తాం

రెంజల్(బోధన్): మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో స్వర్గధామ రథానికి తనవంతుగా రూ. 50 వేల ఆర్థికసాయం అందిస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలో ఆయన చాయ్ పే చర్చ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఎడపల్లి(బోధన్): మండలకేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం లయన్స్‌క్లబ్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కిట్‌బ్యాగులు, రాతపుస్తకాలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్ష్మీ, మెర్సీ, ప్రకాష్‌రావు, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

యువతకు హెల్మెట్లు..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం పలువురు యువకులకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి అందించిన హెల్మెట్‌లను స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఎంపీపీ గౌతమి, సొసైటీ చైర్మన్ దేవేందర్, సర్పంచ్ స్వామి, ఎంపీటీసీ సుధాకర్, అహ్మద్, పాషా, మహేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు..

వర్ని: మండలంలోని 17 గ్రామపంచాయతీలకు క్రీడా పరికరాలను వర్ని ఎంపీడీవో బషీరుద్దీన్ శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జీపీ కార్యదర్శులకు, ప్రజాప్రతినిధులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ నారాయణ, జెడ్పీటీసీ హరిదాసు ఉన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ



వర్ని: మండలంలోని పాత వర్ని గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని, పాఠశాల అదనపు గదులను, జనరల్ ఫంక్షన్ హాల్‌ను శుక్రవారం బాన్సువాడ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. జెడ్పీటీసీ హరిదాసు, సర్పంచ్ వెంబడి పద్మ నాగభూషణం, నాయకులు వీర్రాజు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

వర్ని: మోస్రా మండల ఆరెకటిక సంఘం నూతన కార్యవర్గాన్ని మండలకేంద్రంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొత్తిమీర్‌కార్ అశోక్, కార్యదర్శిగా లింగోజీ, ఉపాధ్యక్షులుగా విజయ్, కోశాధికారి మోహన్ ఎన్నికయ్యారు.

శంకుస్థాపన

బాల్కొండ: ముప్కాల్ మండలంలోని నాగంపేట్‌లో గురడిరెడ్డి సంఘ భవనం అదనపు గదుల నిర్మాణానికి శుక్రవారం ఎంపీపీ సామ పద్మ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ రాజవ్వ, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, ముత్తెన్న, భూమేశ్వర్ పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కుల అందజేత

మోర్తాడ్: మండలంలోని సుంకెట్‌లో ఓ బాధిత కుటుంబానికి రూ.5లక్షల రైతుబీమా చెక్కును శుక్రవారం జెడ్పీటీసీ రవి, సర్పంచ్ కదారి శ్రీనివాస్ అందించారు. స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోడు పట్టాల పంపిణీ

భీమ్‌గల్: అర్హులైన లబ్ధిదారులకు ఎంపీపీ ఆర్మూర్ మహేష్, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య పోడు పట్టాలు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు తదితరులున్నారు.

కానిస్టేబుల్ పోస్టుకు ఎంపిక

ఖలీల్‌వాడి: కమ్మర్‌పల్లి మండలంలోని హసాకొత్తూర్ గ్రామానికి చెందిన రాజుల అర్వింద్ పోలీస్‌కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఎంటెక్ చేసిన అర్వింద్ ప్రస్తుతం బెంగుళూర్‌లో రూ.20 లక్షల ప్యాకేజీ డిజైన్ ఇంజనీర్‌గా పనిచేస్తూనే పట్టు వదలకుండా కానిస్టేబుల్ జాబ్ కొరకు మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించారు. దీంతో శుక్రవారం ఇంపాక్ట్ ఫౌండేషన్, హెచ్‌డీఎఫ్‌సీ ప్రతినిధులు ఆయనను సన్మానించారు. ఉట్నూర్ నరేష్, మాలవత్ పావని ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



రుద్రూర్: వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కోటగిరి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సూచించారు. మండలంలోని రాణంపల్లి గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఆరోగ్యంపై పలు జాగ్రత్తలు, సూచనలు తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. అధికారులు జ్యోతి, ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రెంజల్ మండలంలో..

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీవో గౌస్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రావణ్‌కుమార్ ఇంటింటికీ తిరుగుతూ పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. సిబ్బంది అలీ, సరస్వతీలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

వర్ని: మండలంలోని చేనెంబర్ తండాలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు శుక్రవారం గ్రామస్తులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా నిజాం షుగర్ ఫ్యాక్టరీ భూములకు పట్టాలు ఇప్పించేందుకు మంత్రి కేటీఆర్ హామీ ఇవ్వడంతో, వారు హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతూ తీర్మానం చేశారు. సర్పంచ్ మేనీబాయి, ఉప సర్పంచ్ సతీష్ ,నాయకులు గోవర్ధన్, శివ,ధర్మానాయక్,బాలు,శ్రీనివాస్ ఉన్నారు.

రుద్రూర్: పోతంగల్‌కు చెందిన పద్మశాలి సంఘ సభ్యులు శుక్రవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతు ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అండగా ఉంటామన్నారు. బాన్సువాడలో స్పీకర్‌కు తీర్మానప్రతిని అందజేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఎంపీపీ గౌతమి, సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్ అందజేశారు. సర్పంచ్‌లు అశోక్, శంకర్, ప్రభాకర్, గంగాధర్ పాల్గొన్నారు.

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్ మండల పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు అందజేశారు. ఎంపీపీలు లావణ్య, సామపద్మ, జెడ్పీటీసీలు నర్సవ్వ, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్ ప్రారంభం



బాల్కొండ: మండల కేంద్రంలో నూతన అగ్నిమాపక కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర హోంశాఖ మంత్రి మహముద్ అలీ వర్చువల్‌గా పాల్గొనగా, ఆయనతో కలిసి మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ లావణ్య, జెడ్పీటీసీ దాసరి లావణ్య, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, సర్పంచ్ బూస సునీత, ఉప సర్పంచ్ వాహబ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సానిటరి న్యాప్‌కిన్స్ పంపిణీ..

వేల్పూర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బాలికలకు శుక్రవారం రెడ్‌క్రాస్ సంస్థ సమకూర్చిన సానిటరీ నాప్కిన్స్‌ను రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అందజేశారు. ఎంపీపీ బీమజమున, సర్పంచ్ తీగెల రాధామోహన్, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి





కోటగిరిలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఆశావర్కర్లు .. బోధన్‌లో..

కోటగిరి (రుద్రూర్): తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన(ఎండీఎం) కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె శుక్రవారం 17వ రోజు కొనసాగింది. సమ్మె శిబిరాన్ని ఆశావర్కర్లు సందర్శించి మద్దతు ప్రకటించారు. ఏఐటీయూసీ నాయకులు విఠల్‌గౌడ్, ఎండీఎం కార్మికులు పాల్గొన్నారు.

బోధన్: పట్టణంలో ఎండీఎం కార్మికులు చేపట్టిన సమ్మెకు శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

వర్ని/రుద్రూర్/బోధన్/రెంజల్/డొంకేశ్వర్/బోధన్‌టౌన్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల్లో ప్రభుత్వం సరఫరా చేసిన బతుకమ్మ చీరల పంపిణీ కొనసాగుతోంది. శుక్రవారం ఆయా మండలకేంద్రాలు, గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు బతుకమ్మ చీరలను మహిళలకు పంపిణీ చేశారు. పాలకవర్గ సభ్యులు, బీఆర్ఎస్‌నేతలు పాల్గొన్నారు.






సాలూరలో చీరలను పంపిణీచేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు.. వర్ని మండల కేంద్రంలో..

నేడు ఎడపల్లిలో మెగా జాబ్‌మేళా

బోధన్/ఎడపల్లి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఎంపీఆర్ ఫౌండేషన్ అధ్వర్యంలో శనివారం ఎడపల్లిలోని సరయూ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గస్థాయి నిరుద్యోగ యువత కోసం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మేళా కొనసాగనుంది. హైదరాబాద్ కేంద్రంగా జాతీయ స్థాయి నెట్‌వర్క్ ఉన్న వివిధ రంగాలకు చెందిన ప్రముఖ ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాల కల్పించేందుకు ఆయా కంపెనీల ప్రతినిధులను జాబ్ మేళాకు ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు. 80 కిపైగా కంపెనీల ప్రతినిధులు మేళాకు హాజరుకానున్నారని. ఇందులో 2వేల మందికి పైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభించే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. ఎంటెక్, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఫార్మసీ. బీఫార్మ, వివిధ డిప్లొమా కోర్సులు, ఐటీఐ, ఇంటర్మీడియేట్, పదో తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులని వివరించారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ది ఎక్సార్సిస్ట్(ఇంగ్లీష్) - 11.25, 2.00, 7.35 ; మంత్ ఆఫ్ మధు (తెలుగు) 4.35 మామా మశ్చీంద్ర (తెలుగు) - 10.10
స్క్రీన్-2 –	మ్యాడ్(తెలుగు)-12.20, 6.40, 9.30 స్కంద (తెలుగు) - 3.10
స్క్రీన్-3 –	రూల్స్ రంజన్(తెలుగు) - 12.00, 6.40, 10.00 ; 800(తెలుగు) - 03.20
స్క్రీన్-4 –	మామా మశ్చీంద్ర (తెలుగు)- 11.40 ; జవాన్ (తెలుగు) 2.50 ; స్కంద - 6.15 ; చిన్నా (తెలుగు) 9.45